గురుకులం.. విద్యార్థులకు వరం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మారిన రూపురేఖలు
- ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్య, వసతి
- 13వ తేదీతో ముగియనున్న దరఖాస్తుల గడువు



రుద్రవరం గురుకుల పాఠశాల

మచిలీపట్నంఅర్బన్: ఉచితంగా విద్య, వసతి కల్పిస్తూ నిరుపేద విద్యార్థులకు గురుకులాలు పెద్ద వరంగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు వందశాతం ప్రవేశం కల్పిస్తూ ఎన్నో పేద కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తున్నాయి. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుంది. గురుకుల విద్యాసంస్థల్లో ఎంపికైన వారికి విద్య, వసతి ఉచితంగా కల్పిస్తారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ కూడా ఇస్తారు.

సీట్ల వివరాలు

జిల్లాలోని వివిధ గురుకులాల్లో ఐదవ తరగతి ప్రవేశానికి బాలికలకు 320 సీట్లు, బాలురకు 160 సీట్లు కేటాయించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాలికలకు ఎంపీసీ 160, బైపీసీ 160 సీట్లు, బాలురకు ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి. బాలురుకు రుద్రవరం, పామర్రు, ప్రత్యేకంగా బాలికలకు గుడివాడ (మోటూరు), వీరపనేనిగూడెం, బల్లిపర్రు, చల్లపల్లిలలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నారు. పామర్రు పాఠశాల మినహా అన్ని గురుకులాల్లో ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) వరకు విద్యార్థులకు రెసిడెన్షియల్ విద్యను అందిస్తున్నారు. పామర్రులో ఐదు నుంచి 10వ తరగతి వరకు పాఠశాల, బల్లిపర్రు గురుకులంలో ఇంటర్ ఒకేషనల్ విద్య కొనసాగుతున్నాయి. కృష్ణాజిల్లా ఈడ్పుగల్లులో బాలికలకు, కర్నూలు జిల్లా చిన్న టేకూర్‌లో, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడు బాలురకు ఐఐటీ, మెడికల్ అకాడమీలు ఉన్నాయి.

కామన్ ఎంట్రన్స్ టెస్టుతో ప్రవేశం



విద్యార్థులు తమ సొంత జిల్లాల్లోని గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకున్న గ్రూప్ అక్కడ లేకపోతే జిల్లా జోన్ పరిధిలో ఉన్న మరో గురుకుల కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ గురుకులాల్లో ఇంటర్ చేరాలంటే ప్రవేశ పరీక్షలో పాస్ అవ్వాలి.

– కే శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, బీఆర్ అంబేడ్కర్ గురుకులం, రుద్రవరం

మనబడి నాడు - నేడుతో మహర్దశ

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మనబడి నాడు – నేడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ దశల వారీగా పలు రకాల మౌలిక వసతులు కల్పించారు. తొలి విడతలో పాఠశాలలను అభివృద్ధి చేశారు. అలాగే రెండవ విడత ప్రభుత్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలలను కలుపుకొని అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి బీఆర్‌ఏజీ సెట్–2025 పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఐదవ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్, గురుకుల విద్యాలయాలు (ఇంగ్లిష్ మీడియం), ఐఐటీ–మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు https:// apbragcet.apcfss.in ద్వారా ఈనెల 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 41వ డివిజన్ మూడు స్తంభాల సెంటర్ సమీపంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఆదివారం రాత్రి పరామర్శించారు. బాధిత మహిళలను అగ్నిప్రమాద ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కిట్టుతోపాటు జిల్లా సర్వజన ఆస్పత్రి మాజీ డైరెక్టర్ రాంబాబు ఉన్నారు.

'పది' పరీక్షలకు ఐదు కేంద్రాలు

పెడన: ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ–2 వైవీ హరనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూల్‌లో ఏ, బీ సెంటర్లు(రెండు కేంద్రాలు), బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, చెన్నూరు జెడ్పీ హైస్కూల్, మదరసా ఉన్నత పాఠశాలల్లో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పెడన మండలంలో 587 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలు



గూడూరు: వేతనాల పెంపు డిమాండ్‌తో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు గూడూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు తరలివెళ్లారు. సీఐటీయూ నాయకురాలు పీ రెజీనా రాణి ఆధ్వర్యంలో మండలం నుంచి 120 మంది అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు మహాధర్నాకు వెళ్లారు. రెజీనా రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26 వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

చల్లపల్లి: ధర్నాలో పాల్గొనేందుకు వెళుతున్న అంగన్‌వాడీలను అడ్డుకునేందుకు చల్లపల్లి పోలీసులు సోమవారం వేకువజాము నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండులో పహారా కాశారు. విజయవాడకు వెళుతున్న ప్రతి బస్సును తనిఖీ చేశారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా అబ్దుల్ మతీన్

మచిలీపట్నంటౌన్: కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పదవుల నియామకాలను చేపట్టింది. దీనిలో భాగంగా సోమవారం స్థానిక డీసీసీ కార్యాలయం పట్టాభి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా అబ్దుల్ మతీన్, మచిలీపట్నం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మట్ట బాల నాగేశ్వరరావులకు నియామక పత్రాలను డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ అందజేశారు.

పెళ్లి కుమారునిగా వెంకన్న

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం స్వామివారిని పెళ్లి కుమారునిగా అలంకరించారు. అనంతరం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఆలయంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

వ్యక్తికి జైలుశిక్ష

చల్లపల్లి: గ్రామ దేవత అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి గ్రామస్తులను బెదిరించిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్ష, పదివేలు జరిమానాను కోర్టు విధించినట్లు చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు మండల పరిధిలోని చింతలమడకు చెందిన ఘంటసాల నాగబాబు 2019లో గ్రామంలో ఉన్న గంగానమ్మ అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు అడ్డువచ్చిన వారిని బెదిరించాడు. దీంతో అప్పటి ఎస్‌ఐ నాగరాజు నేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మొవ్వ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పీ రాజన్ ఉదయ్ ప్రకాష్ సోమవారం నిందితునికి ఏడాది జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి కార్యాలయం పరిధిలో ఉన్న పలు ఖాళీలను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ ఎం జయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెడికల్ ఇంజినీర్–1, రేడియోగ్రాఫర్ – 2, ల్యాబ్ టెక్నీషియన్– 1, ఆడియోమెట్రిషియన్ –3, ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్–2/కౌన్సిలర్– 1, ప్లంబర్– 2, ఓటీ అసిస్టెంట్– 3, మెడికల్ రికార్డు అసిస్టెంట్ – 2, జీడీఏ/ఎంఎన్‌ఓ/ఎఫ్‌ఎన్‌ఓ– 16, ఆఫీస్ సబార్డినేట్– 2 పోస్టులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఒక ఏడాది కాలానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు Krishna. nic. in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను మచిలీపట్నంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉన్న డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 22వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

అన్నప్రసాద వితరణ

నాగాయలంక: అమలక ఏకాదశి(ఉసిరిక చెట్టు ప్రాధాన్యత) పర్వదినం పురస్కరించుకుని స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీపోతురాజుస్వామి దేవస్థానంలో స్వచ్ఛంద అన్నదాన కమిటీ ఆధ్వర్యాన సోమవారం 250మంది పేదలు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలోని ఉసిరిక చెట్టు వద్ద ప్రత్యేక పూజ నిర్వహించారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'యువత పోరు' విజయవంతం చేయాలి



పెడనలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉప్పాల రాము



అవనిగడ్డలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



యువతపోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం యువత, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని, ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు వారికి న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 12న పిలుపునిచ్చిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువత, నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నియోజకవర్గంలో మామూళ్ల వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, నాయకులు మద్ది చిన్నా, శేషగిరిరావు పాల్గొన్నారు.

కోడూరు: యువత పోరును విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు పరిశె మాధవరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పెడన: ఈ నెల 12వ తేదీన జరిగే యువత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాము కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజుల విషయంలో తీరని అన్యాయం చేసిందన్నారు. విద్యార్థులకు మద్దతుగా మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరుకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి అచ్చుతరావు, గరికపాటి వెంకట రామానాయుడు, తిరుమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతపోరు పోస్టర్ ఆవిష్కరణ

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన మచిలీపట్నంలో నిర్వహించనున్న యువతపోరు పోస్టర్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12న జరిగే ధర్నాలో పార్టీ నాయకులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ మాజీ చైర్మన్, పార్టీ నగర కన్వీనర్ షేక్ సిలార్ దాదా, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్ పాల్గొన్నారు.

రాయచోటి ఎస్‌ఐను సస్పెండ్ చేయాలి



జేసీ గీతాంజలిశర్మకు వినతిపత్రం అందజేస్తున్న చైతన్యవేదిక సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాయచోటిలో హిందువులపై తప్పుడు కేసులు పెట్టిన ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పరాసుపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి ఊరేగింపు చేస్తుండగా ముస్లింలు హిందువులపై దాడి చేశారు. ఈ దాడిలో హిందువులపై తప్పుడు కేసులు పెట్టిన ఎస్‌ఐ నరసింహారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కే చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేశారు. హిందూ ఐక్య వేదిక నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విగ్రహ ఏర్పాటుకు చర్యలు

పెడన: పట్టణంలో ఎమ్మార్పీస్ పెడన నియోజకవర్గ నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని రోడ్లు భవనాల శాఖకు చెందిన స్థలంలో ఆదివారం రాత్రికి రాత్రే పిల్లర్లు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున ఎమ్మార్పీస్ నాయకులు అక్కడకి చేరుకోవడంతో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు, ఎస్‌ఐ సత్యనారాయణ, సీఐ నాగేంద్రప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పిల్లర్లు నిర్మించడానికి వీల్లేదని టీపీవో సుజనకుమారి వారికి స్పష్టం చేశారు. దీంతో అధికారులకు, ఎమ్మార్పీఎస్ నాయకులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరకు పిల్లర్లను మున్సిపల్ అధికారులు తొలగించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో 'ఉప్పాల'

కృత్తివెన్ను: పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము సోమవారం మండలంలోని చినగొల్లపాలెంలో పర్యటించారు. స్థానికంగా ఉన్న శ్రీకోవెలగిరి అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో రాముతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక యువత పాల్గొన్నారు.

జీవనోపాధి పురోభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల ద్వారా జీవనోపాధి పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన సెర్ప్ సీఈవో జిల్లాకు రానున్నారని తెలిపారు. జిల్లాలో సామర్థ్యం ఉన్న వివిధ రకాల జీవనోపాధి పురోభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించనున్నారని చెప్పారు. కొత్తగా వస్తున్న పారిశ్రామికవేత్తలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై వివరాలు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి చిన నరసింహులు, వ్యవసాయశాఖ డీడీ మనోహర్, ఎల్‌డీఎం లోకేష్, చేనేత, జౌళిశాఖ ఏడీ సాయిప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి రామలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

▪ సావిత్రీబాయి పూలేకు నివాళి



అవనిగడ్డ: మహిళా అభ్యుదయం కోసం అహర్నిశలు శ్రమించిన సావిత్రీబాయి పూలే ఆశయాలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, నాయకులు మద్ది చిన్నా, శేషగిరిరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చల్లపల్లి: స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రత్నకుమారితో కలిసి జ్యోతిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు.

▪ నేటి నుంచి మహంకాళమ్మ జాతర

గూడూరు: ముక్కొల్లులో ప్రసిద్ధి చెందిన శ్రీ మహంకాళమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి మహాచండీ హోమం, బుధవారం అమ్మవారి జీవిత చరిత్ర గానం, గురువారం అమ్మవారి ముందు కుంభాన్ని పోసి, పోతురాజు గెడలతో అమ్మవారి నగర ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

▪ 21 మద్యం సీసాలు స్వాధీనం

కోనేరుసెంటర్: మచిలీపట్నం మండలంలోని పల్లెతుమ్మలపాలెం గ్రామంలో విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సోమవారం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒడుగు గోవిందరాజులు మద్యం అమ్ముతూ సిబ్బందికి పట్టుబడ్డాడు. అతని నుంచి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఎం రామశేషయ్య తెలిపారు.

▪ విద్యుత్ తనిఖీలు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలో విద్యుత్ దుర్వినియోగం, చౌర్యాలను అరికట్టేందుకు విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్తంగా మచిలీపట్నం డీ1 సెక్షన్ పరిధిలో సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, ఆపరేషన్ ఈఈ జీ గోవిందరావు ఆధ్వర్యంలో 37 బృందాలుగా 76 మంది సిబ్బంది పాల్గొని 2,340 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనుమతించిన లోడ్‌కు మించి విద్యుత్ వినియోగించిన 289 మందిపైన రూ. 11.40 లక్షల అపరాధ రుసుము విధించారు.

▪ పాక్షికంగా నీటి సరఫరా

పెడన: వాటర్ హెడ్ వర్క్స్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా కూడా పాక్షికంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎం గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్ బెడ్లు రిపేరు కారణంగా ఈ పరిస్థితి నెలకొందని, మరమ్మతులు పూర్తవ్వగానే తాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో చేస్తామని పేర్కొన్నారు.

▪ కొనసాగుతున్న నాంచారమ్మ అమ్మవారి ఉత్సవాలు

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పురవీధుల్లో ఇంటింటా మేళతాళాలు, డప్పు కళాకారులతో సందడిగా విచ్చేసిన అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. తమ ఇంటి వద్ద పసుపు, కుంకుమ, పూలు, పండ్లు తదితర కానుకలు సమర్పించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగుతోంది. ప్రస్తుతం వి.కొత్తపాలెం గ్రామంలో చిన్న అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికీ అమ్మవారిని తీసుకువెళ్లి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవారి ముందు చేసిన కర్రసాము, వీరతాడు విన్యాసాలు ఆకట్టుకుంటున్నారు. మరో రెండురోజుల పాటు అమ్మవారి గ్రామోత్సవం వి.కొత్తపాలెంలో కొనసాగనుంది.

▪ విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేత

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు 1986–87 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పరీక్ష కిట్లు(పేడ్, జామెంట్రి బాక్స్, రెండు పెన్నులు, పౌచ్) సోమవారం అందజేశారు. అలాగే పరీక్షల డ్యూటీలో పాల్గొనే ఉపాధ్యాయులకు స్టీలు వాటర్ బాటిల్స్ అందజేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చల్లపల్లి: ఓ వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన మండల పరిధిలోని పురిటిగడ్డలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పురిటిగడ్డకు చెందిన జంపాన అనురాధ స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణంలో పని చేస్తున్న వ్యక్తిని పెద్దల అనుమతి లేకుండా పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. అయితే కొన్ని రోజులుగా అనురాధ తాను పెళ్లి చేసుకున్నట్లుగా చెప్తున్న వ్యక్తిని తనను ఇంటికి తీసుకువెళ్లమని కోరుతున్నా.. అతను పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.